చిత్రవిమర్శ :

# ★ పాదుక ★

శ్రీ రాజరాజేశ్వరీవారి పాదుక—జెమినీ స్టూడియోస్‌లో 12-3-45 వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు ప్రెస్ షో యిచ్చినారు. ఎంతోమంది పత్రికా ప్రతినిధులు ఆ ప్రదర్శనాన్ని చూడటానికి వొచ్చారు.

దర్శకులు శ్రీ కడారి నాగభూషణంగారు ఊళ్ళో లేనందున ఇక్కడకు రాలేదనీ, ఈ చిత్రం జెమినీ, రాజరాజేశ్వరీవారి జాయింట్ ప్రొడక్షన్ అని, జెమినీ యజమానులు శ్రీ వాసన్‌గారు ప్రదర్శనానికి ముందుగా తమ తొలి పలుకలో చెప్పారు. యధారీతిని ప్రదర్శనం ముగిసింది.

చిత్రాన్ని గురించి యేం చెప్పాలో మాత్రం తోచటం లేదు. కథ సుప్రసిద్ధమైనది. ఇంతకు పూర్వ మొకసారి చిత్రంగా తయారుచేయబడినది కూడా. నాటక రంగస్థలిని ఈ నాటకానికి ఎంతో ప్రఖ్యాతి వుంది.

పాదుక-శ్రీ పానుగంటివారి రచన రామాయణ కథ ప్రజల హృదయాల్లో ఏలాంటి convictions ను కలిగించినదో వాటికి లోటు రానీకుండా ప్రదర్శణానుగుణ్యంగా రచియింపబడినది. ఆ నాటకాన్ని ఆధారంగా తీసుకుని అవసరమయిన చోట్ల—శ్రీ శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి (మైలవరం సావిత్రి నాటక కర్త)గారి అదనపు సంభాషణలతో—అద్భుతంగా తయారుచేయాలనే సంకల్పంతో తీసిన చిత్ర మిది.

పాదుక నాటకాన్ని చూసిన ప్రతివారికి "చిదిమిన పాల్గారు చెక్కుటద్దములరై" అన్న పద్యముతో అద్దంకి శ్రీరామ మూర్తిగారు (దశరధుడు) ప్రజా హృదయాన్ని చూరగొనే వారు. ఒక్క అద్దంకివారి పేరుతో ఆ నాటకాన్ని ప్రతి వూళ్ళోనూ ఎన్నో వందల రాబడి వచ్చేది. రాముడుగా, సి. యస్. ఆర్; భరతుడుగా బందావారు కూడా ప్రతిష్ఠ నార్జించుకున్నవారే రంగస్థలిని.

వీరందరి సమ్మేళనంతోపాటు, శీవిగల పాత్రధారణలో ప్రతిభగల శ్రీమతి కన్నాంబ—కైక—ఆంధ్రుల అల్లారు ముద్దు తారగా ఖ్యాతివడసిన శ్రీమతి పుష్పవల్లి సీతగానూ-ఈ చిత్రంలో నటిస్తున్నారంటే — ఈ సంవత్సరం చిత్రాలలో ఇది మేటి చిత్రంగా తయారౌతుందని చాలామంది ఆశపడ్డారు అనటం అతిశయోక్తి కాదు.

అంతే కాకుండా అన్ని హంగులూ గలిగి, ఉత్తమమైన యంత్ర సాధన సంపత్తిగల జెమినీలో — ఈ చిత్రాన్ని తీయటం-ఆర్టు డైరక్టరుగా శ్రీ శేఖర్ ఉండటం—ఆ ఆశను ద్విగుణీకృతం చేశాయి.

కాని చివరకు ఈ చిత్రం అన్ని విధాల నిరుత్సాహాన్ని కలిగించిందనక తప్పదు. ప్రధాన పాత్రలను ప్రత్యేక దృష్టితోనూ, అప్రధానమయిన పాత్రలను మరొక దృష్టితోనూ, వీరు ఈ చిత్రాన్ని తయారుచేశారే కాని, ఈ రెంటికీ సమన్వయాన్ని సమకూర్చుకోలేక పోయారు.

కైకకు సవతులైన, కౌసల్య, సుమిత్రలకు చాలా అన్యాయం జరిగిందనే చెప్పాలి. ఆధునిక వేషభాషలతో కౌసల్య పాత్రను, కైకకు కడగొట్టు కూతురన్నంత చిన్నపిల్లగా సుమిత్ర పాత్రను-చూపించారంటే వేషధారణలో ఏ రవంత శ్రద్ధను కనపరచనట్లు స్పష్టం.

అల్లారు ముద్దుతార పుష్పవల్లి-అల్లారు ముద్దు పాత్రలకే గాని సీతవంటి పతివ్రతా వేషాలకు పనికిరాదేమో అనిపించినది.

చండికగా—అద్భుతంగా నటించిన కన్నాంబ—కైకగా రాణించలేకపోయింది. దశరథుడే అన్ని పాత్రలలోనూ రవంత ఉత్తమంగా నటించ గలిగాడు. మిగిలినవారు తమ ప్రాచీన యశస్సును నిలబెట్టుకోలేక పోయినా రనక తప్పదు.

నాటకాలలోని సంభాషణలు సినిమా కనుగుణ్యంగా మార్చుకోక తప్పదు. ఆ ప్రయత్నంలో కవిగారు విఫలులయారు.

ఎంతో అద్భుతమైన సెట్టింగులను శేఖర్‌గారు తయారు చేసినా ఆ ఎఫెక్టు ఛాయాగ్రహణంలో రాలేదు. అందుకు బాధ్యులు శేఖరుగారు కాదేమో ?

కనీసం శబ్దగ్రహణమయినా నిర్దుష్టంగా లేదంటే ఇంతకన్న అన్యాయం యేముంది? పాటలు సామాన్యంగా వున్నాయి. చిత్రాలలో ప్రాత పద్ధతిని పద్యాలను పాడించడంవల్ల అధిక ప్రయోజనం కన్పించలేదు.

ఇదివరలో వచ్చిన పాదుకకన్న—ఈ పాదుక ఏ విధంగానూ ఉత్తమంగా ఉన్నదనటానికి ఆస్కారంలేదు. కనుక ఈ సంవత్సరం ఇప్పటికి తయారైన చిత్రాలతోబాటు ఇది కూడా నిరుత్సాహాన్నే కలిగించింది—అనక తప్పదు...